

సంగారెడ్డి పాత బస్టాండ్‌లో

రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రతిపాదనల ప్రతులను అందజేస్తున్న జగ్గారెడ్డి

మంత్రిని కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 12 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పాత బస్టాండ్‌లో రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జగ్గారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన ప్రతిపాదనల ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డిలోని పాత బస్టాండు వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందని, ఆర్టీసీకి కూడా ఆదాయం చూకూరుతుందని తెలిపారు. రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జగ్గారెడ్డి తెలిపారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రతిపాదనలను వివరిస్తున్న జగ్గారెడ్డి

అయ్యో.. బిడ్డ ఎంత పనైంది!

అశ్రునయనాల మధ్య తండ్రి, ఇద్దరు కూతుళ్ల అంత్యక్రియలు

ఒకే గొయ్యిలో ముగ్గురి మృతదేహాలు ఖననం

7వ

కోహీర్‌లో విద్యార్థిని

వెంటపడి కరిచిన కుక్క

స్కూలు బయట నిలిచి ఉన్న ముగ్గురిపై దాడి

7వ

ఫార్మాసిటీ రద్దయ్యేవరకు ఆందోళనలు

7వ



పైపులైన్ కాలువలో మట్టిపెళ్లల కింద కూరుకుపోయిన కూలీలను రక్షిస్తున్న సహచరులు

కూలీలకు తప్పిన ముప్పు

గ్యాస్ పైప్‌లైన్ తవ్వుతుండగా ప్రమాదం

మట్టి దిబ్బ కూలి ముగ్గురికి గాయాలు

రక్షించి ఆస్పత్రికి తరలించిన తోటి కూలీలు

రామాయంపేట, ఆగస్టు 12: గ్యాస్ పైపు లైను తవ్వకాల్లో పెను ప్రమాదం తప్పింది. మరమ్మత్తు పనుల్లో భాగంగా మట్టి దిబ్బ కూలి ముగ్గురు కూలీలు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. తోటి కూలీలు, నిర్వాహకులు తక్షణమే తేరుకోవడంతో మూడు నిండు ప్రాణాలు కాపాడినవారయ్యారు. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా రామాయంపేట-సిద్ధిపేట రహదారిలోని మల్లెచెరువు ప్రాంతంలో కొన్ని రోజులుగా ఓ ప్రైవేటు కంపెనీ గ్యాస్ పైపులు వేస్తుంది. ఈ మేరకు సోమవారం పనులు జరుగుతున్న క్రమంలో జ్యోతి, కిషోర్, సుభాష్ అనే ముగ్గురు కూలీలు కాలువలో క్రేన్ ద్వారా కిందికి వదులుతున్న పైపులను సరిచేస్తుండగా ఒక్కసారిగా పైనుంచి మట్టి వారిపై పడింది. దీంతో శ్వాస ఆడక కొద్దిసేపు ఇబ్బందిపడ్డారు. వెంటనే క్రేన్ సహాయంతో మట్టినంతా తొలిగించి 108 వాహనంలో బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

పెద్ద చెరువు ఆక్రమణలపై

హైడ్రా నజర్

చెరువులు, కుంటలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అస్సెట్స్ మానిటరింగ్ అథారిటీ) అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జీవవైవిధ్య పెద్దచెరువు ఆక్రమణలపై దృష్టి సారించింది. బఫర్‌జోన్, నాలాల ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమవుతున్నది. చెరువు చుట్టూ వెలసిన కాలనీలు, వెంచర్లలో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ప్లాట్లు, ఆక్రమణలను గుర్తిస్తున్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు, వెంచర్లు

ప్రమాదంలో చెరువు ఉనికి


పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

డ్రోన్ కెమెరాతో సర్వే

చెరువు విస్తీర్ణం, ఆక్రమణల గుర్తింపు

నివేదిక ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు ఆదేశం

కూల్చివేతలకు రంగం సిద్ధం!



అమీన్‌పూర్ పెద్ద చెరువును ఆక్రమించేందుకు అక్రమార్కులు పోసిన మట్టి కుప్పలు

పటాన్‌చెరు, ఆగస్టు 12: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జీవవైవిధ్య పెద్దచెరువు పరిధిలో ఆక్రమణలపై 'హైడ్రా' దృష్టిసారించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అస్సెట్స్ మానిటరింగ్ అథారిటీ జీవవైవిధ్య పెద్దచెరువు శిఖం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, కాల్వలపై వెలసిన అక్రమ కట్టడాలను తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నది. చెరువు చుట్టుపక్కల ఉన్న వెదిరి, పాంచజన్య, వాణినగర్, దర్శన్‌నగర్ కాలనీలను ఆనుకుని ఈ చెరువు ఉంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక ఆక్రమణలు వెలసినట్టు ఆరోపణలున్నాయి. వారం క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువు పరిసరాలను, పక్కనే ఉన్న వెంకటరమణ కాలనీ ప్లాట్లను కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్న ఓ సంస్థ నిర్మాణాలను పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని అమీన్‌పూర్ మునిసిపల్, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు హైడ్రా సిబ్బంది చెరువు విస్తీర్ణం, ఆక్రమణలను గుర్తించడానికి డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు.

వందలాది అక్రమ నిర్మాణాలు

అమీన్‌పూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వందలాది అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయని తెలిసినా మున్సిపల్-పంచాయతీ సిబ్బంది ఇష్టారాజ్యంగా నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారు. అలాగే, ఎఫ్‌టీఎల్ పరిధిలోనే రెండులే అవుట్లకు గతంలో హెచ్‌ఎండీఏ అనుమతులు జారీ చేయడం గమనార్హం. ప్రస్తుతం హైడ్రా సర్వేతో అక్రమ నిర్మాణాల యజమానులు బెంబేలెత్తుతున్నారు. ఒక్క కాలనీ పరిధిలోనే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 250 నిర్మాణాలున్నాయి. గతంలో హెచ్‌ఎండీ అనుమతులతో నిర్మించిన ఓ బహుళ అంతస్తుల భవనం పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నది. ఆయా నిర్మాణాలను ఉపేక్షించరాదనే భావనతో హైడ్రా అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. హైడ్రా కమిషనర్ స్వయంగా పరిశీలించడంతో కఠిన చర్యలు తప్పవని భావిస్తున్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దచెరువుతో పాటు ఇతర గొలుసుకట్టు చెరువులు, కుంటలు, నాలాల వివరాలతో అధికారులు నివేదికను సిద్ధం చేస్తున్నారు. జలాశయాలతో పాటు మండలంలో విస్తరించి ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములపై కూడా హైడ్రా దృష్టి కేంద్రీకరించినట్లు తెలిసింది. ఈమేరకు 993, 630, 343 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములను రక్షించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

● వినతులు స్వీకరించిన కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి ● సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



సంగారెడ్డిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి



ప్రజావాణి దరఖాస్తులను పరిశీలిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, ఆగస్టు 12: ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తు వెలువెత్తాయి. వినతులు స్వీకరించిన కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే ప్రజలు కలెక్టరేట్‌కు వస్తారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించి భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. మెదక్‌లో నిర్వహించిన ప్రజావాణికి 212 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యలపై 63, పెన్షన్ 35, రుణమాఫీ 16, డబుల్‌బెడ్‌రూం 10, స్వయంఉపాధి 5, ఇతర సమస్యలపై 83 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అలాగే, జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ దరఖాస్తులను స్వీకరించారు. సంగారెడ్డి జిల్లాలో రసాయన పరిశ్రమల కాలుష్యం నుంచి రక్షించాలని హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామానికి చెందిన బద్రేష్ కలుషిత నీరు నింపిన బాటిల్, ముఖానికి మాస్కుతో వచ్చి కలెక్టర్ ఫిర్యాదు చేశారు. అందోల్ మండలం అల్మాయిపేట గ్రామానికి చెందిన ఎర్రారం పోచయ్య భూమి మ్యూటేషన్ చేయాలని, కందికి చెందిన చిట్కుల్ కృష్ణ ఐఐటీలో 2.38 ఎకరాల భూమిని కోల్పోయిన తమకు ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని స్విస్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యం కార్మికులను భయబ్రాంతులకు గురిచేస్తున్నదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన కోరారు.

మార్ట్‌లో తూనికలు కొలతలశాఖ తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: సంగారెడ్డి మంజీరనగర్‌లోని ఓ మార్ట్‌లో తూనికలు కొలతలశాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు సోమవారం తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. మార్ట్‌లో ఉపయోగిస్తున్న తూకం యంత్రం రెన్యువల్ చేయనట్టు గుర్తించారు. ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న వస్తువులపై గరిష్ఠ చిల్లర ధర లేకపోవడాన్ని గమనించారు. అధికారులు ఈ రెండు విషయాలపై కేసులు నమోదు చేశారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.అనీల్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపార సంస్థల్లో ఉపయోగించే కాంటా, బాట్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషిన్లను ఎప్పటికప్పుడు రిన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ప్రతీ ప్యాకేజీపై ఎమ్మార్పీ, ప్యాకింగ్, ఎక్స్‌పయిరీ తేదీ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి

వర్గల్, ఆగస్టు 12 : విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు తప్పవని సదరు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దశల వారీగా నిరసనలు చేపడతామని, సమ్మెకు పిలుపునిస్తామన్నారు. వర్గల్ మండల వనరుల కేంద్రం వద్ద విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు సోమవారం సమగ్ర శిక్ష వర్గల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో పనిభారం అధికమవడంతో చాలామంది తనువు చాలించారన్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలోగాని, సమగ్ర శిక్షలో గాని ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్‌కుమార్, జిల్లా కోశాధికారి సొప్పరి కరుణాకర్, జిల్లా మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, మండల అధ్యక్షుడు ర్యాకల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.


మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించి నినదిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

అధికారుల అండదండలతో పేదల భూముల పట్టామార్పిడి

- మాజీ కోఆప్షన్ సభ్యుడి నిర్వాకంపై విచారణ జరపాలి
- ధరణి ప్రక్షాళన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి

మద్దూరు, ఆగస్టు 12 : అధికారుల అండదండలతో పేదల భూములను కుటుంబసభ్యుల పేరిట అక్రమంగా పట్టామార్పిడి చేసుకున్న మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జిలానీ నిర్వాకంపై విచారణ చేయాలని తహసీల్దార్‌ను ధరణి ప్రక్షాళన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి కోరారు. బాధిత రైతుల వినతి మేరకు ఆయన సోమవారం మండలంలోని బంజరా గ్రామాన్ని సందర్శించారు. రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహసీల్దారు సంజీవ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జిలానీ తండ్రి దస్తగిరి 1972లో సాదాబైనామాల ద్వారా పలువురు పేదరైతులకు భూములను విక్రయించాడన్నారు. వారసత్వంగా వస్తున్న ఈ భూములను వారి వారసులు కూడా కబ్జాలో ఉంటూ కాస్తు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పట్టా కోసం పలుమార్లు రైతులు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, అధికారులు, సిబ్బంది అండదండలతో జిలానీ ఆ దరఖాస్తులను మాయం చేయించాడని ఆరోపించారు. ధరణి పోర్టల్ వచ్చాక సైతం బాధిత రైతులు పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ సిబ్బంది సహకారంతో అడ్డుకున్నాడని మండిపడ్డారు. ఆనాడు బీఆర్ఎస్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ కుటుంబసభ్యుల పేరిట అక్రమంగా 40 ఎకరాల భూములను పట్టామార్పిడి చేసుకున్నాడని ఆరోపించారు. దర్జాగా రైతుబంధు సైతం పొందుతూ పేద రైతులకు తీరని అన్యాయం చేశాడని కోదండరెడ్డి ధ్వజమెత్తారు. అంతేకాకుండా సుమారు రెండున్నర ఎకరాల చెలకపోషి కుంటను కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బాధిత రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కోదండరెడ్డితో కలిసి ఫిర్యాదు చేసిన వారిలో జంగిలి యాదగిరి, జంగిలి ఆంజనేయులు, జంగిలి భిక్షపతి, జంగిలి స్వామి, జంగిలి మల్లేశం, రాసూరి ఉప్పలయ్య, రాసూరి బీరయ్య, రాసూరి ఉపేందర్, రాసూరి చంద్రయ్య, రాసూరి మల్లయ్య, గుడిసె యాదగిరి, గుడిసె సత్యనారాయణ, గుడిసె కిష్టయ్య, మీస సిద్ధిలింగం ఉన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కోదండరెడ్డి

పొలానికి నీరు పెడుతుండగా..
విద్యుదాఘాతంతో రైతు మృతి


రైతు జిందేష్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 12: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని కొట్టాలలో సోమవారం చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గరబోయిన జిందేష్(40) సోమవారం ఉదయం తన వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారుకు సరఫరా అయ్యే వైరు తెగి పడగా, అది గమనించని జిందేష్ వైరును తాకడంతో కరెంటు షాక్ తగిలి కిందపడి పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. స్పృహకోల్పోయిన జిందేష్‌ను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ తగాదాతో సోదరుడిపై రోకలిబండతో దాడి

● అక్కడికక్కడే మృతి చెందిన అన్న


రాజునాయక్(ఫైల్)

అక్కన్నపేట, ఆగస్టు 12 : భూ తగాదాలతో అన్నపై ఓ తమ్ముడు రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అక్కన్నపేట మండలం మసిరెడ్డి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు రాజునాయక్(54) అతడి తమ్ముడు మధ్య కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య తరచూ జరుగుతున్న తగాదాలతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరుగుతుంది. ఈ తరుణంలోనే రాజునాయక్‌పై అతని సోదరుడు రోకలి బండతో దాడి చేశాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనుమానాదాస్పద స్థితిలో వివాహిత మృతి

శివ్వంపేట, ఆగస్టు 12 : కుటుంబ తగాదాలతో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన సోమవారం నవాబ్‌పేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన రాంపల్లి లత(33) ఈనెల 9న భర్త అంజిరెడ్డితో గొడవ పడింది. ఆమె అనారోగ్యం పాలవడంతో 10న తూప్రాన్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స కోసం సూరారం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం లత మృతి చెందింది. కూతురు మరణంపై తండ్రి సుభాన్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, భర్త అంజిరెడ్డి కొట్టడంతోనే మూడు రోజులుగా ఇంట్లో లేవలేని స్థితిలో లత ఉండగా ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


రామని రాము(ఫైల్)

ములుగు, ఆగస్టు 12 : కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన రామని రాము(26) వృత్తి రీత్యా గ్రామంలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్నాడు. అయితే, సోమవారం రాము కొద్దిరోజులుగా కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు రాము తల్లి దేవమ్మకు నీటిని వదిలి వస్తానని చెప్పి ఇంటి ఆవరణలోనే స్లాబ్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

అయ్యో.. బిడ్డ ఎంత పనైంది!


కుమారుడు, మనుమరాళ్ల మృతదేహాల వద్ద రోదిస్తున్న కృష్ణ తల్లి నాగమణి

● అశ్రునయనాల మధ్య తండ్రి, ఇద్దరు కూతుళ్ల అంత్యక్రియలు
● ఒకే గొయ్యిలో ముగ్గురి మృతదేహాలు ఖననం

మనోహరాబాద్, ఆగస్టు 12: 'అయ్యో బిడ్డ ఎంత పని జరిగింది. ఒక్క ప్రమాదంలోనే కుటుంబం ఆగమైంది కదా.. తండ్రి ఇద్దరు బిడ్డలకు ఒకే రోజు రాసిపెట్టాడా ఆ దేవుడు' అంటూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరయ్యారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మెన్ కృష్ణ(42), అతని ఇద్దరు కూతుళ్లు వర్షిత (12), వరణి(7) ఆదివారం మేడ్చల్ జిల్లా గౌడవెల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని చనిపోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామమైన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు తీసుకురాగా గ్రామస్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. గ్రామానికి చెందిన నారాయణ, నాగమణిల చిన్నకుమారుడైన కృష్ణకు రైల్వేలో పనిచేసిన తండ్రి ఉద్యోగ విరమణ చేయడంతో ఉద్యోగం వచ్చింది. పని నిమిత్తం కృష్ణ పదేళ్లుగా మేడ్చల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఈ ఘోరం జరగగా, సోమవారం గ్రామంలో తండ్రీకూతుళ్ల అంత్యక్రియలు నిర్వహించారు.. ఒకే గొయ్యిలో తండ్రి, ఇద్దరు కూతుళ్లను ఖననం చేశారు. అయితే తండ్రి, ఇద్దరు కూతుళ్లు ఒకే ప్రమాదంలో జరగడంతో తల్లి నాగమణి కుమారుడు, మనమరాళ్ల మృతదేహాల వద్ద పడి రోదించడం అక్కడి వారిని కదలించి వేసింది. బాధిత కుటుంబాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.

లక్ష్యానికి దూరంగా పాలసేకరణ

అస్తవ్యస్తంగా జహీరాబాద్ మిల్క్ చిల్లింగ్ కేంద్రం నిర్వహణ

జహీరాబాద్, ఆగస్టు 12 : జహీరాబాద్ నియోజకవర్గంలో పాలఉత్పత్తి పుష్కలంగా ఉన్నప్పటికీ సేకరణలో మాత్రం మిల్క్‌చిల్లింగ్ కేంద్రం లక్ష్యానికి దూరంగా ఉంది. ఆసక్తి గల పాడిరైతులను ప్రోత్సహించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని మిల్క్‌చిల్లింగ్ కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

శిథిలావస్థలో భవనం

జహీరాబాద్ పట్టణంలో 1973లో మూడు ఎకరాలలో ఏర్పాటు చేసిన మిల్క్‌చిల్లింగ్ కేంద్రం భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. చిల్లింగ్ చేసే, అధికారులు విధులను నిర్వహించే భవన గోడలకు తేమ పడుతున్నది. నిర్వహణ సరిగ్గా లేక కేంద్రంలోని సామగ్రి తుప్పుపడుతున్నది. ఉద్యోగుల క్వార్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కేంద్రం చుట్టూ స్థలం కబ్జాలకు గురవుతున్న పట్టించుకోవడం లేదు.



జహీరాబాద్ పట్టణంలోని మిల్క్ చిల్లింగ్ కేంద్రం

సకాలంలో చెల్లించని బిల్లులు

జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతీరోజు 40 వేల పైచిలుకు లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. అందులో నుంచి మిల్క్‌చిల్లింగ్ కేంద్రం మాత్రం ఐదు వేల లీటర్ల సేకరణకే పరిమితమైంది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో మాత్రమే పది వేల లీటర్ల పైచిలుకు పాలను సేకరిస్తామని, మిగతా సమయాల్లో ఐదు వేలపైచిలుకు లీటర్లు వస్తాయని అధికారులు తెలిపారు. స్థానికంగా సేకరించిన పాలను హైదరాబాద్‌లోని తార్నాక, లాలపేటకు తరలిస్తారు. అక్కడ పాల ఉత్పత్తులు తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణాలకు సరఫరా చేస్తారు. ఆరు మండలాల పరిధిలోని 52 గ్రామాల ద్వారా నిత్యం పాలను సేకరిస్తారు. ప్రోత్సాహకం కరువవడం, మార్కెట్ డిమాండ్ తగినట్లు ధర ఇవ్వకపోవడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. పాడిరైతులకు సకాలంలో పాల సేకరణ డబ్బు ఇవ్వకపోవడమే దీనికి ప్రధాన కారణం. మిల్క్‌చిల్లింగ్ కేంద్రం లీటరు పాలకు సుమారు రూ.50 ఇస్తుండగా ఇతర డెయిరీలు అంతకుమించి వెంటవెంటనే చెల్లిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో లీటరు పాలు రూ.80 పలుకుతుంది. మిల్క్‌చిల్లింగ్ కేంద్రానికి పాలను పోస్తే నష్టపోతామని రైతులు ఇటువైపు చూడడం లేదు.


పూర్తిగా ధ్వంసమైన సిబ్బంది క్వార్టర్లు

రూ.75లక్షల బిల్లుల పెండింగ్



మామిడిగి, గణేష్‌పూర్, హుసెల్లి తదితర గ్రామాలల రైతుల వద్ద రోజూ 900 లీటర్లు పాలను సేకరించి మిల్క్ చిల్లింగ్ కేంద్రానికి తీసుకొస్తా. సెంటర్ పరిధిలో 55 రోజులకు సుమారు 300 మంది రైతులకు రూ.75లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నా ఒక్కనికే రూ.20లక్షలు రావాల్సి ఉంది. రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేసేందుకు రైతులందరం కలిసి సన్నద్ధమవుతున్నాం.

- మాణిక్‌రెడ్డి, మామిడిగి రైతు

ఎక్కువ పాల సేకరణ కోసం కృషి



మిల్క్ చిల్లింగ్ కేంద్రంలో ఎక్కువ మొత్తంలో పాల సేకరణకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో తిరిగి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు అవసరమైన గేదేలను బ్యాంకుల ద్వారా సబ్సిడీ ప్రాతిపదికన ఇప్పించేలా ప్రయత్నం చేస్తున్నాం. పాలను సరఫరా చేసే రైతులకు పశువులకు దాణాను సబ్సిడీపై అందిస్తాం. ఎక్కువ మొత్తంలో పాలను తీసుకువచ్చి కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని రైతులను కోరుతున్నాం.

- డేవిడ్‌రాజు, మిల్క్ చిల్లింగ్ కేంద్రం మేనేజర్

ఫార్మాసిటీ రద్దయ్యేవరకు ఆందోళనలు చేస్తాం

● భూముల కోసం రైతులకు అధికారుల బెదిరింపులు
● ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించబోం
● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మండిపాటు
● రద్దుచేయాలని ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేత


ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, రైతులు

జహీరాబాద్/న్యాల్‌కల్, ఆగస్టు 12 : ఫార్మాసిటీ రద్దు చేసేంతవరకు ఆందోళనలు చేపడతామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హెచ్చరించారు. సోమవారం ఆయన రైతులతో కలిసివచ్చి జహీరాబాద్ పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్ గ్రామంలో రైతులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాల్‌కల్ మండంలోని డప్పూర్, మల్గి, వడ్డీ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ కోసం రెండు వేల ఎకరాల్లో భూసేకరణకు చర్యలు చేపడుతున్న తీరు సరికాదన్నారు. రైతులపై అధికారులు బెదిరింపులకు పాల్పడడంపై మండిపడ్డారు. రైతుల, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నాకే అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించబోమని ఆయన హెచ్చరించారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తు భూమలను తీకుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పచ్చని పల్లెప్రాంతాల్లో కాలుష్య కారక కర్మాగారాల ఏర్పాటుతో భవిష్యత్తులో ప్రజారోగ్యాలపై తీవ్రప్రభావం చూపుతుందని ధ్వజమెత్తారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ వారి పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పడిన పలు పరిశ్రమలతో ప్రజలు నిత్యం నరకయాతను అనుభవిస్తున్న తీరును ఆయన ఆర్డీవోకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చెర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్‌ఎస్ జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, డప్పూర్ రవీందర్, నాయకులు విజయకుమార్, గుండప్ప, శివరాజ్, నర్సింహారెడ్డి, రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమతో పంటలకు దెబ్బ

చర్యలు తీసుకోవాలి : ఉసిరికపల్లి గ్రామస్థులు


ఉసిరికపల్లిలో పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

శివ్వంపేట, ఆగస్టు 12 : కాలుష్య కారక పరిశ్రమతో పంటలు దెబ్బతింటున్నాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఉసిరికపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో పేర్నాక్ బయో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తుండడంతో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ గ్రామస్థులతో కలిసి సోమవారం పరిశ్రమ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా అశోక్ సాదుల మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమ నిర్మాణంతో రాబోయే రోజుల్లో ప్రజలు అనారోగ్య బారిన పడే అవకాశం ఉంటుందని, పరిశ్రమ ఏర్పాటును నిలిపివేయించాలని కోరారు.

కోహీర్‌లో విద్యార్థిని వెంటపడి కరిచిన కుక్క

స్కూలు బయట నిలిచి ఉన్న ముగ్గురిపై దాడి


కుక్క కాటుతో మోకాలికి అయిన గాయాన్ని చూపుతున్న ఫైజానూరిన్

కోహీర్, ఆగస్టు 12 : కోహీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఫైజా నూరిన్ మధ్యాహ్నం సమయంలో స్కూలు గేటు వద్ద తన స్నేహితురాళ్లతో నిలుచుని ఉంది. ముగ్గురు విద్యార్థులపైకి ఓ వీధి కుక్క దాడి చేసేందుకు రాగా వారు భయపడి పరిగెత్తారు. ఇద్దరు విద్యార్థులు తప్పించుకోగా ఫైజా నూరిన్‌పై కుక్క దాడి చేసింది. విద్యార్థినిని మోకాలు, నడుముపై కరచి గాయపరిచింది. తక్షణమే విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం కోహీర్ గ్రామంలో వీధి కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏ వీధిలో చూసినా కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. జహీరాబాద్ పట్టణంలో ఉన్న కుక్కలను కోహీర్ శ్రీవారు ప్రాంతానికి ట్రక్కుల్లో తీసుకువచ్చి వదిలినట్లు గ్రామ ప్రజలకు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

తప్పిన ముప్పు..

పెచ్చులూడిన పాఠశాల సీలింగ్



సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ (నల్లవాగు) పాథమికోన్నత పాఠశాలలో తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం పాఠశాలలో వరండా పైకప్పు సీలింగ్ పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు మరో హాల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తుండడంతో ప్రమాదం తప్పింది. స్కూల్‌లో 90 మంది విద్యార్థులు చదవుకుంటున్నారు. పెచ్చులూడిన చోట తరగతులు నిర్వహిస్తుంటారు. ప్రమాద సమయంలో విద్యార్థులు అక్కడ లేకపోవడంతో టీచర్లు ఊపిరి పీల్చుకున్నారు.

-కల్హేర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

కొబ్బరిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి


దశరథ్ మృతదేహం

జహీరాబాద్, ఆగస్టు 12 : కొబ్బరికాయలను తెంపేందుకు చెట్టు ఎక్కిన యువకుడు కాలుజారి కిందపడి మృతి చెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో సోమవారం చోటుచసుకున్నది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన కథనం ప్రకారం.. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన మృతుడు చిట్టెం దశరథ్(32) శ్రీరాంమహేళాలోని గాదరాజు ఇంట్లో కొబ్బరికాయలను తెంపేందుకు వెళ్లాడు. చెట్టుపైకి ఎక్కి కొబ్బరికాయలను తెంపుతున్న క్రమంలో కాలుజారి కిందపడడంతో మృతిచెందాడు. ఆయన వివరించారు. దశరథ్ భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కుక్కల దాడిలో మిషన్ భగీరథ కార్మికులకు గాయాలు


బాచేపల్లిలో కుక్కల దాడిలో గాయపడిన నగేష్

నారాయణఖేడ్, ఆగస్టు 12 : నిజాంపేట మండలం బాచేపల్లిలో సోమవారం కుక్కల దాడిలో మిషన్ భగీరథకు చెందిన ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాచేపల్లిలోనిపెద్దమ్మ ఆలయం వద్ద గల నీటి ట్యాంకును క్లోరినేషన్ చేయడానికి సోమవారం ఉదయం వాటర్‌మెన్ భూమయ్య, సహాయకుడు పోగుల నగేష్ వెళ్లారు. ట్యాంకు వద్ద వారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. కుక్కల దాడిని గమనించిన గ్రామస్థులు అరుపులు వేయడంతో అవి పారిపోయాయి. కాగా గ్రామానికి చెందిన చాకలి రమేష్ కూతురు వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేయడానికి యత్నించాయి. అక్కడ ఉన్న స్థానికులు రాళ్లతో వాటిని తరమివేయడంతో, బాలికకు ఎలాంటి గాయాలు కాలేదు. గ్రామంలో 80 నుంచి 100 వరకు వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, దీంతో గ్రామంలో తిరగడానికి భయం వేస్తుందని, చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కుకునూరుపల్లి, ఆగస్టు 12 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన చింతల ఉపేందర్, తన్నీరు గణేష్ ఆటో, డీసీఎం వ్యాన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన టాస్క్‌ఫోర్స్ బృందం పోలీసులతో చిన్నకిష్టాపూర్‌లో వాహనాలను పట్టుకుని 50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

గజ్వేల్‌లో 20 క్వింటాళ్లు..

గజ్వేల్, ఆగస్టు 12: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం గ్రామం మోహినిగడ్డ తండాకు చెందిన భూక్య నితిన్ ఆటోలో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని గజ్వేల్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధి ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద ఆటోను పట్టుకుని 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధి ముట్రాజ్‌పల్లిలో పట్టుకున్న ఆటో, నిందితుడిని చూపుతున్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం



అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

డిగ్రీ కాలేజీలో న్యాయ అవగాహన సదస్సు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: సంగారెడ్డిలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని, ప్రతి ఒక్కరూ పోక్సో చట్టం, వరకట్న నిషేధచట్టం, గృహహింస చట్టం, మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్ తదితర చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను సందర్శించిన ఏరువాక శాస్త్రవేత్తలు

చిలప్‌చెడ్, ఆగస్టు 12: కొత్తరకం విత్తనాలైన వరి చిరు సంచుల విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తాయని ఏరువాక వ్యవసాయ శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చండూర్ గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డి సాగు చేస్తున్న కూనారం 12368 అనే సన్న రకం వంగడం 125-130 రోజుల వ్యవధిలో కోతకు వచ్చి ఎకరాకు 26- 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. అదేవిధంగా కంపాసాగర్ 10631 సన్నరకం వంగడం 120- 125 రోజుల్లో కోతకు వచ్చి 27 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు.

నేడు డిగ్రీ కాలేజీలో క్విట్‌ఇండియా సెమినార్

నర్సాపూర్, ఆగస్టు 12: కృషి, విజ్ఞాన, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో క్విట్ ఇండియా జాతీయ ఉద్దేశం అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు లక్ష్మీకాంతం తెలిపారు. ఈ సెమినార్‌కు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారన్నారు.

ఆక్రమణలపై ప్రజావాణిలో ఫిర్యాదులు

పటాన్‌చెరు, ఆగస్టు 12: మండల పరిధిలోని ముత్తంగిలో సర్వేనెంబర్ 389 ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని సదరు స్థలం ఎర్రగుంట్ల కాలువ బఫర్‌జోన్‌లోకి వస్తుందని గ్రామస్థుడు, సరిహద్దు పట్టాభూమి యజమాని గడీల సురేష్‌గౌడ్ సోమవారం ప్రజావాణిలో పటాన్‌చెరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆక్రమణలపై జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. స్పందించిన పటాన్‌చెరు రెవెన్యూ సిబ్బంది ఇటీవల ఆక్రమణలను తొలగించేందుకు రాగా గ్రామ పంచాయతీ ఈవో తప్పుదారి పట్టించారని ఆరోపించారు. అక్రమార్కులకు కొమ్ము కాసే విధంగా గతంలో సస్పెండ్ అయిన ఓ పంచాయతీ ఈవో ఇంటినెంబర్ కేటాయించగా డీపీవో రద్దు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ఈవో సైతం రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి ఆక్రమణలను తొలగించకుండా అడ్డుపడ్డారని పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట సర్వేనెంబర్ 164లో మాజీ ఎంపీపీ ఈర్లదేవానంద్ కుటుంబ సభ్యులు అసైన్డ్ భూములు కొనుగోలు చేసి షట్టర్లు వేసి అద్దెకు ఇచ్చారని ప్రజావాణిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలగించాలని గతంలో తహసీల్దార్ ఇచ్చిన ఆర్డర్ అమలు కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసైన్డ్‌దారులు విక్రయించిన భూములను ప్రభుత్వ భూమిగా ప్రకటించి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

● కంది: కందిలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. కేవలం ఒకే ఫిర్యాదు మాత్రమే అందింది. ప్రతీ వారం తహసీల్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తురనే విషయం ఆయా గ్రామాల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమానికి అన్ని శాఖల మండలాధికారులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ మండల అభివృద్ధి, ఇరిగేషన్ శాఖ, ఉపాధిహామీ శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. కందిలో ఇళ్ల మధ్యలో కల్లు దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ గ్రామస్థులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు.


పటాన్‌చెరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ముత్తంగి గ్రామస్థులు

●రేగోడు: తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒకే దరఖాస్తు వచ్చిందని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

● రామాయంపేట: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు సగం పరిష్కరించగలిగామని తహసీల్దార్ రజిని తెలిపారు. సోమవారం దరఖాస్తులు కలుపుకుని మొత్తం 236 రాగా 108 సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. సోమవారం వచ్చిన 16 దరఖాస్తుల్లో 5 డబుల్ బెడ్‌రూం, 6 భూముల సమస్యల పరిష్కారం, 5 ఇతర సమస్యలపై అందాయి.

పర్యావరణంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మనోహరాబాద్, ఆగస్టు 12: ప్రకృతి పర్యావరణంపై జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మనోహరాబాద్ మండలం కూచారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఈ నెల 2న జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ముఖ్య అతిథిగా జీఎంఆర్ పోచంపల్లి రహదారి మేనేజర్ వెంకటరమణ, మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు. విజేతలకు బాహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 12 : సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా ప్రణాళికబద్ధంగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఎన్‌సీసీ క్యాడెట్ మార్చ్‌ఫాస్ట్, మెడికల్ టీమ్‌తో ఎమర్జెన్సీ సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరు గ్యారంటీల పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే విధంగా శకటాల ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఏవో పరమేశం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువు మానేసినవారికి ఓపెన్‌స్కూల్ వరం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: చదువు మధ్యలో మానేసినవారికి ఓపెన్ స్కూల్ వరమని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్‌కు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆమె సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపిన వారికి మళ్లీ చదువు కొనసాగించేందుకు ఓపెన్ విద్య చక్కటి అవకాశమన్నారు. ఓపెన్ సర్టిఫికెట్ రెగ్యులర్‌తో సమానమని, అభ్యాసకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ట్రైనీ కలెక్టర్, డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్‌స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● రేగోడు: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సుశీల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు. రేగోడు ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లను తీసుకుంటున్నామని, ఓపెన్ స్కూల్‌లో చేరేవారు 9493817535 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

కేతకీలో ప్రత్యేక పూజలు

● మహారాష్ట్ర నుంచి భక్తుల పాదయాత్ర

ఝరాసంగం, ఆగస్టు 12: సంగారెడ్డి జిల్లాలో అతి పెద్ద శైవక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు కిక్కిరిసిపోయారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ ఆవరణలోని మండపంలో భక్తులు అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారుల అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. మహారాష్ట్రలోని హుమ్నాబాద్ నుంచి పాదయాత్రగా భక్తులు శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం రాత్రి చేరుకున్నారు. పాదయాత్రగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. రాత్రి ఆలయ ఆవరణలో భజన కార్యక్రమాలను చేపట్టారు. ఏటా శ్రావణ మాసంలో ఆలయానికి భక్తులు మహారాష్ట్ర నుంచి పాదయాత్రగా తరలివస్తారు.


కేతకీ అమృత గుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఖేడ్‌లో మహారుద్రయాగం

నారాయణఖేడ్,ఆగస్టు 12: పట్టణంలోని కాశీనాథ్ ఆలయంలో శ్రావణ మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని మహారుద్ర యాగం, రుద్రాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గురురాజ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదాన్ని అందించారు.

గణపతి ఆలయ అర్చకుడికి అవార్డు

హైదరాబాద్ ఆసీఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీలోని గణపతి ఆలయ అర్చకులైన నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన శివయ్యశర్మ ఆదివారం రాత్రి సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురోహిత వైభవ బ్రహ్మ అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో హైదరాబాద్ లలిత కళా సమాఖ్య రుద్రాక్ష వైభవం, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో బాధ్యులు అవార్డు అందజేసి సత్కరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా అభియాన్


తూప్రాన్‌లో అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

మెదక్ అర్బన్/తూప్రాన్, ఆగస్టు 12: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మెదక్ పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాందాస్ చౌరస్తా నుంచి రామాలయం వరకు మహిళా కార్యకర్తలు జాతీయ జెండా చేపట్టి నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీతో ముందుకు సాగారు. తూప్రాన్ పట్టణంలో సోమవారం బీజేపీ నాయకులు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారోత్సవాలను పురస్కరించుకొని తూప్రాన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేసి, పూలమాలలతో అలంకరించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు భూమన్నగారి జానకీరాంగౌడ్, సీనియర్ నాయకులు తాటి విఠల్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు సంఖ్య యాదగిరి, మండల ఇన్‌చార్జి రామునిగారి మహేశ్‌గౌడ్, పర్స పోచేందర్, పోతరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జిన్నారంలో తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

సంగారెడ్డి జిల్లాలో..

జిన్నారం/నారాయణఖేడ్, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకోవాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిన్నారంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలతో ప్రధాన రహదారిపై ర్యాలీ జరిపి ప్రతి ఒక్కరిలో జాతీయ సమైక్యతను చాటేందుకు కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేష్, సుధాకర్, రాము, మహేష్, లక్ష్మణ్, శ్రీను, కరుణాకర్, వీరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లో బీజేపీ నాయకులు తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, ఖేడ్ కోకన్వీనర్ నగేష్ యాదవ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాజుగౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ..

సంగారెడ్డిలో కొవ్వొత్తులతో డాక్టర్ల ప్రదర్శన



సంగారెడ్డిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12 : పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సంగారెడ్డిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) మంజీర బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మంజీర నగర్ సహస్రా ఆస్పత్రి నుంచి ఐబీ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) మంజీర బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ చక్రపాణి, టీజీఎంసీ మెంబర్ డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ, హెల్త్‌కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్‌ఆర్‌డీఏ) సభ్యులు డాక్టర్లు శ్రీధర్, రాజుగౌడ్, పరుశురాం, జ్యోతిర్మయి, హరినాథ్‌రెడ్డి, కిషోర్, శరత్, వెంకట్, మల్లిక, గాయత్రీ, వినయ్, శిల్ప, రమాదేవీ, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

'సహారా' ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యం


సంగారెడ్డిలో విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలందిస్తున్న సహారా ఆస్పత్రి డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: సహారా ఇంక్లూసివ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఆస్పత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ ధీమంత్‌రెడ్డి నేతృత్వంలో వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సహారా సంస్థ సెక్రటరీ మఠం శంకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. విశ్రాంత ఉద్యోగులను గుర్తించి ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినందుకుగాను సహారా ఆస్పత్రి యాజమాన్యానికి విశ్రాంత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..


23వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 12 : రాజకీయాలను పక్కన పెట్టి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని 23వ వార్డు శివాజీనగర్‌లో వార్డు కౌన్సిలర్ కూన వనిత సంతోష్‌కుమార్ అధ్వర్యంలో 14వ ఫైనాన్స్ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆమె టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాహుల్‌రాథోడ్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, కాలనీవాసులు జ్ఞానేశ్వర్, ప్రశాంత్, బాషా, అన్నపూర్ణ, ప్రశాంత్, సూరి, అర్జున్, మణికంఠ, మహేష్‌చారి పాల్గొన్నారు.

తల్లి సమాధికి ఎంపీ నివాళి


చంద్రమ్మ సమాధికి నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, ఆగస్టు 12: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ తన మాతృమూర్తి చంద్రమ్మ షెట్కార్ 14వ వర్ధంతిని పురస్కరించుకొని ఖేడ్ శివార్లలోని ఆమె సమాధికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్ సోదరులు నగేష్ షెట్కార్ ఆయన సతీమణి మాలాదేవి షెట్కార్, జితేందర్‌నాథ్ షెట్కార్, మాజీ జడ్పీటీసీ సంగీత షెట్కార్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, యువజన కాంగ్రెస్‌నాయకులు సాగర్‌షెట్కార్, విజయ్‌కుమార్ షెట్కార్, తదితరులు సమాధిపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.



రాష్ట్రప్రభుత్వం రైతులకు రెండో విడత రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. దీంతో కొత్తరుణాలు పొందడానికి బ్యాంకులు తెరువక ముందే బ్యాంకుల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. శని, ఆదివారాల్లో వరుసగా రెండు రోజులపాటు సెలవులు రావడంతో సోమవారం తెల్లవారుజామున 6 గంటల నుంచే ఆయ గ్రామాల నుంచి రైతులు నారాయణఖేడ్‌లోని బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు ముందు కొందరు తోపులాడుకుంటూ, మరి కొందరు తెరుచుకోని దుకాణాల వద్ద కూర్చొని నిరీక్షిస్తూ కనిపించారు.

-నారాయణఖేడ్, ఆగస్టు 12

అప్పుల బాధలో ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో వ్యక్తి మృతి

నర్సాపూర్, ఆగస్టు 12: కుటుంబ పోషణతో పాటు పిల్లల పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చలేక పురుగులమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన గంటాకృష్ణ(50) వ్యవసాయంతో పాటు కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిలకు సుమారు రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలని వేదనకు గురైన కృష్ణ ఆదివారం రాత్రి తన పొలం వద్దకు పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులకు ఈ విషయం చెప్పాడు. కుటుంబీకులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయినట్లు ఎస్‌ఐ వివరించారు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు..


గంటాకృష్ణ(ఫైల్)

చేగుంట, ఆగస్టు 12: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు అదే వలలో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బోనాల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బోనాలకు చెందిన కుమ్మరిస్వామి(41) ఆదివారం రాత్రి గ్రామంలోని శివారులోని పోచమ్మ చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు ఉదయం చెరువు దగ్గరకు వెళ్లి చూడగా చెరువు గట్టుపై దుస్తులు, చెప్పులు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించగా, స్వామి మృతదేహం లభించింది. మృతుడు స్వామి చేపలు పట్టేక్రమంలో ప్రమాద వశాత్తు చేపల వలలో చిక్కుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రామాయంపేటలో చైన్‌స్నాచింగ్

రామాయంపేట, ఆగస్టు 12: నడుచుకుంటూ వెళ్తోన్న ఓ మహిళ మెడలోంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన ఘటన రామాయంపేటలో చోటు చేసుకున్నది. పట్టణానికి చెందిన అనసూయమ్మ సోమవారం రాత్రి ఇంటి బయటి నుంచి వెళ్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరిలో ఒకరు అకస్మాత్తుగా ఆమె మెడలోంచి పుస్తెల తాడును పట్టి లాగడంతో ఆమె కిందపడిపోయింది. చోరీకి గురైన బంగారు పుస్తెలతాడు సుమారు మూడు తులాలవరకు ఉందని బాధితురాలు తెలిపింది. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా చైన్ స్నాచర్లను గుర్తించే పనిలో పడ్డారు.

జనావాసాల మధ్యలో కల్లు దుకాణం వద్దు

● కంది తహసీల్ కార్యాలయం ఎదుట గ్రామస్థుల ఆందోళన

కంది, ఆగస్టు 12: జనావాసాల మధ్యలో కల్లు దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట కంది గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. మండలకేంద్రంలోని లంకగడ్డ ప్రాంతంలో కొందరు నూతనంగా కల్లు దుకాణం ఏర్పాటు చేస్తున్నారని, వారిని వెంటనే అడ్డుకుని కల్లు దుకాణం పెట్టకుండా చూడాలని శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరయ్య, ఆ వీధిలోని ప్రజలతో కలిసి ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ విజయలక్ష్మి జనావాసాల మధ్యలో ఎట్టి పరిస్థితుల్లోనైనా కల్లు దుకాణం ఏర్పాటు చేయకుండా చూస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఆందోళనలో జానీపాషా, శ్రీనివాస్ రెడ్డి, బాబురావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు 'ఇన్‌స్పైర్'


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి ఇన్‌స్పైర్ దోహద పడుతుందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఇన్‌స్పైర్ నామినేషన్స్‌పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను బాలశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ప్రయత్నంలో భాగంగా మంచి ఆవిష్కరణలను జిల్లా నుంచి అత్యధికంగా రూపొందించి పంపాలని సూచించారు. జిల్లా నుంచి ఆలోచనాత్మక నామినేషన్లు పెంచడం కోసం టెక్నికల్ సపోర్ట్ జిల్లా, డివిజన్‌స్థాయి, మండలస్థాయి మానిటరింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంవో అనురాధ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డిప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జిఉపాధ్యాయులు ఉన్నారు.

'యువతరం ద్వారానే నవసమాజ నిర్మాణం'

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: యువతరం ద్వారానే నవసమాజ నిర్మాణం సాధ్యమౌతుందని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యువత సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం సాధ్యమౌతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీ

జిన్నారం, ఆగస్టు 12: బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై వ్యాసరచన పోటీల విజేతలైనవారికి మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి బహుమతులు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేసి, ఫైలేరియా నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌వో నర్సింలు, కౌన్సిలర్ శైలజ, డాక్టర్ నిర్మలారెడ్డి, హెచ్‌ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేజీబీవీ సిబ్బందికి టైం స్కేల్ వర్తింపచేయాలి: తపస్

చేగుంట ఆగస్టు 12: కేజీబీవీ పాఠశాలల్లో దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) వర్తింపచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేగుంట మండలశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పోలంపల్లి, ఆదర్శ పాఠశాల, వడియారం, కేజీబీవీ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నర్సాపూర్, ఆగస్టు 12: విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులుగా అరకొర వేతనంతో పనిచేస్తూఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నందున వారిని క్రమబద్ధీకరించి సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

● రామచంద్రాపురం, ఆగస్టు 12: విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా సీఆర్పీ, ఐఈఆర్పీ, ఎంఐఎస్, సీవోఆర్డీ, సీసీవో, కేజీబీవీలలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని తోటి ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.

హిందూసంఘాల ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో నిరసన


జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, హిందూసంఘాల నాయకులు

జహీరాబాద్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో దళిత, హిందూ, క్రైస్తవ, సిక్కులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం జహీరాబాద్ పట్టణంలో హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన, ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలని, దాడులకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగ పలువురు హిదూ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను సామాజిక మాధ్యమాల్లో చూస్తుంటే కంటతడి పెట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌లో దాడులకు పాల్పడ్డవారిపై చట్టరీత్యాచర్యలు చేపట్టే విధంగా ఒత్తిడి తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్త, నౌబాద్ జగన్ పాల్గొన్నారు.